# ప్రముఖ ప్రజాతంత్రవాది
# రాజేందర్ సచార్‌కు జోహార్లు

**2018** ఏప్రిల్ 29న ప్రముఖ ప్రజాతంత్రవాది, ప్రజల ప్రజాస్వామిక హక్కుల పక్షాన నిలిచిన జస్టిస్ రాజేందర్ సచార్ మరణించారు. రాజేందర్ సచార్ ఒక రాజకీయ కార్యకర్తగా, కార్మిక యూనియన్ నాయకునిగా జీవితం ప్రారంభించి, జీవితకాలం సోషలిస్టుగా వున్నారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయవాదిగా పనిచేసే క్రమంలో 1970లో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా సచార్ జంకూగొంకూ లేకుండా దృఢంగా నిలిచారు. 1975లో ఇందిరాగాంధి ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితిని ఆయన వ్యతిరేకించటమేగాక, అత్యవసర పరిస్థితిని సుప్రీంకోర్టు సమర్ధించటాన్ని కూడా వ్యతిరేకించారు. ఇందిరాగాంధి మరణానంతరం ఢిల్లీలో సాగిన సిక్కుల ఊచకోత ఘటనలకు బాధ్యులైన నాయకులందరిపై కేసులు నమోదు చేయాలని ఆయన పోలీసులను ఆదేశించారు. 1992లో బాబ్రీమసీదు విధ్వంసానంతరం దేశవ్యాపితంగా జరిగిన మత హింసను, 2002లో గుజరాత్‌లో జరిగిన ముస్లిముల ఊచకోతను ఆయన తీవ్రంగా ఖండించారు. పదవీ విరమణానంతరం 1995వరకు ఆయన 'పియుసిఎల్' అధ్యక్షుడిగా కొనసాగారు.

భారతదేశంలో ముస్లిముల సామాజిక, ఆర్థిక, విద్యావిషయక స్థితిగతులపై సమగ్ర పరిశోధన జరిపి 2006లో ఆయన ఆధ్వర్యంలో రూపొందించిన 'సచార్ కమిటీ నివేదిక' ద్వారా ఆయన సుపరిచితులు. ఒక సోషలిస్టుగా ఇరాక్‌పై అమెరికా సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధాన్ని, ఇతర జోక్యాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజల ప్రజాస్వామిక హక్కుల పక్షాన దృఢమైన మద్దతుదారునిగా నిలిచిన సచార్‌కు జోహార్లర్పిస్తోంది.

oooo

## సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ జక్కా వెంకయ్యకు జోహార్లు

**నెల్లూరుజిల్లా** పాత కోవూరుతాలూకా దామరమడుగు గ్రామంలో 1930 సం॥లో ఓ సంపన్న కుటుంబంలో జన్మించిన కా॥జక్కా వెంకయ్య, 88 సం॥వయస్సులో 29-5-18న అనారోగ్యంతో నెల్లూరులో మరణించారు. వారి మృతిపట్ల సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్రకమిటి విచారం వ్యక్తంచేస్తోంది. వారి కుటుంబ సభ్యులకూ, సిపిఎం పార్టీకీ సంతాపాన్ని తెలియజేస్తోంది.

కా॥పుచ్చలపల్లి సుందరయ్య బంధుత్వ కుటుంబాలకు చెందిన కా॥వెంకయ్య 20 సం॥వయసులోనే కమ్యూనిస్టులకు రక్షణ ఇచ్చారనే ఆరోపణపై నిర్బంధానికి గురయ్యారు. యువకునిగా కమ్యూనిస్టు సిద్ధాంతంపట్ల ఆకర్షితుడై, కార్యకర్తగా కోవూరు తాలూకా కమ్యూనిస్టుపార్టీ నిర్మాణానికి కృషిచేశారు. వ్యవసాయ కూలీ ఉద్యమాల్లో చురుకైన పాత్ర నిర్వహించారు. పీడిత కులాలపై సాంఘిక దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పలు సందర్భాల్లో ఉద్యమాలకు నాయకత్వం వహించారు.

గతితార్కిక భౌతికవాద సూత్రాలను, ఆర్థికశాస్త్రాన్ని సులువైన పద్ధతిలో రైతుకూలీలకు బోధించటమేగాక, వానిని గ్రంధస్థం చేశారు. 1964లో సిపిఎంనుండి విప్లవకారులు విడివడిన సందర్భంలో సిపిఎం పార్టీ నెల్లూరుజిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి కడదాకా సిపిఎం నాయకునిగా బాధ్యతలు నిర్వహించారు.

కామ్రేడ్ జక్కా వెంకయ్యకు సిపిఐ(ఎం-ఎల్)రాష్ట్రకమిటి జోహార్లర్పిస్తోంది.

ooooo